చెరువులు, కుంటలు ఎండిపాయె..!

- ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు
- రూ.10లక్షల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఐదు చెరువుల్లో మూడు చెరువులు ఎండిపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో పెద్దచెరువు, కొండసముద్రం, కునాయికుంట, నల్లచెరువు, రేగులకుంట, గొల్లోని కుంటలు ఉన్నాయి. ప్రతి ఏడాది మత్స్యకారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను రాత్రి పగలు కాపాడుకొని జీవనం సాగించేవారు. ఈ ఏడాది చెరువులు, కుంటల్లో నీరు ఎండిపోవడంతో ఉపాధి కోల్పోయారు. కొండసముద్రం, పెద్దచెరువులో అంతంత మాత్రం నీరు ఉన్నా, కునాయికుంట, నల్లచెరువు, రేగులకుంటలలో చుక్క నీరులేకపోవడంతో చేపలు నిల్వ లేక మత్స్యకారులు లోబోదిబోమంటున్నారు. నల్లచెరువు, కునాయికుంట, రేగులకుంటలో చేపలు ఉంటే సుమారు రూ.10లక్షల వరకు ఆదాయం వచ్చేదని ఈసారి నీరు లేకపోవడంతో ఆదాయం కల్పోయామని మత్స్యకారులు వాపోతున్నారు. చేపల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు వీధిన పడే దుస్థితిలో ఉన్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



చుక్కనీరు లేని కునాయికుంట



నీరులేక వెలవెలబోతున్న నల్లచెరువు

ప్రభుత్వం ఆదుకోవాలి



చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే కుటుంబాలు వీధిన పడతాయి. ఈ ఏడాది చెరువుల్లో చేపలు లేక దుర్భర పరిస్థితిలో ఉన్నాం. - బయ్య భిక్షం, మత్స్యకారుడు

బీజేపీతోనే అన్నివర్గాలకు సమన్యాయం

పెద్దవంగర: బీజేపీతోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతోందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు ఉప్పరగూడెం, గంట్లకుంట, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లో ప్రచార రథంపై బీజేపీ శ్రేణులతో కలసి ప్రచారం చేశారు. స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. అంతకు ముందు మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో పూజలు చేశారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. రానున్న ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే వరంగల్ జిల్లా అభివృద్ధి పథంలో నడిపిస్తానని అరూరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు, జిల్లా కార్యదర్శి సాయిని ఝాన్సీ, మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

క్లుప్తంగా

నవీన్‌కుమార్‌కు నంది అవార్డు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు గర్రెపల్లి నవీన్ కుమార్ నంది అవార్డు స్వీకరించారు. హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో తెలంగాణ సంస్కృతి సాహితి బుక్ ఆఫ్ రికార్డ్స్ ఉగాది జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదేళ్ల క్రితం లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి గర్రెపల్లి నవీన్ కుమార్ అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవలు చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి అవార్డును అందజేశారు.

వారంలోపు డబ్బులు చెల్లించాలి

దంతాలపల్లి: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు వారంలోపే డబ్బులు చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంజపల్లి వీరన్న డిమాండ్ చేశాడు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో ఉపాధి కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు రోజువారి కూలి రూ. 600 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు సెగ్గం యాకయ్య, నాయకులు చింత నవీన్, ఏరుగొండ ప్రవీన్, యాకయ్య, శ్రీను ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సభ




చిన్నగూడూరు: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వల్లూరి పద్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమస్యలపై చర్చించే మండల సభలో ఆయా శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తూ సభ వెలవెలబోయింది. సమావేశంలో భాగంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముఖ్యంగా ఐకేపీలో ధాన్యం కొనుగోలు, తాగునీటి సమస్యపై, పారిశుద్ధ్యంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీఓ యాకయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మరిపెడ: మే 3న మహబూబాబాద్‌లో పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపుకోసం నిర్వహించే సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లా సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం మరిపెడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకయ్య, నారాయణ, సైదులు, వెంకటేష్, కార్తీక్, వెంకన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్రలే ఆధారం



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామ శివారులో రైతు కనకయ్యకు చెందిన చేనులో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండడంతో రెండు కర్రలను నేలలో పాతి దానిపైన మరో కర్రను వెడల్పుగా పెట్టి విద్యుత్ తీగలు కిందకు వాలిపోకుండా అమర్చిన దృశ్యం సోమవారం కనిపించింది. విద్యుత్ తీగలకు కర్రలే ఆధారం కావడంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఆడబిడ్డను ఆశీర్వదించండి

దంతాలపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవితకు ఓట్లు వేసి ఆడబిడ్డను ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దాట్ల గ్రామంలో కార్యకర్తల సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడారు. మహబూబాబాద్ అభివృద్ధిలో కవిత పాత్ర గొప్పదని, మళ్లీ పార్లమెంట్‌కు పంపి మరింత అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు ఒలాద్రి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు.. అభివృద్ధికి మలుపు

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుకు ఓట్లువేసి గెలిపించాలని, కాంగ్రెస్ గెలుపు.. అభివృద్ధికి మలుపు అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ మండలంలోని చిన్నకిష్టాపురం, వేమునూరు గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న సమయంలో సీతారాంనాయక్ చేసిన అభివృద్ధి ఏమిలేదని, ఎంపీ కవిత సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఎంపీటీసీ మంగిలాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్, కూన శ్రీనివాస్, దూపటి వినయ్, మాజీ సర్పంచ్ రవినాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తెలంగాణ మలిదశ ఉద్యమంలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా క్రియాశీలక పాత్ర పోషించి జైలు జీవితాన్ని అనుభవించి అనేక ఉద్యమాలలో భాగస్వాములైన అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సమక్షంలో సుధాకర్ కాంగ్రెస్‌లో చేరాడు.

గార్ల: కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోరుతూ సోమవారం మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ఉపాధి కూలీల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కిషన్, రామారావు, మోహన్, రాహుల్, రాజేష్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధి

గూడూరు: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లైన్‌తండా, కోబల్‌తండా, కలకత్తాతండాతో పాటు పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు గౌడ్, పూజారి శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మెజారిటీతో గెలిపించాలి

దంతాలపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు బట్టునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దసరోజ్ రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి కొమ్మినేని సతీష్, ఎంపీటీసీ యాకయ్య, నాయకులు రవీందర్, బాలాజీ, కసిరెడ్డి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి

గార్ల: మే 1వ తేదీన మండల కేంద్రమైన గార్లలో నిర్వహించే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సీఐటీయూ అనుబంధ సంఘాల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు అంబటి వీరస్వామి, అలువాల రామకృష్ణ, ఇమ్మడి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని ఇఫ్టూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధం శెట్టి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, శంకర్, గోపి, నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి

తొర్రూరు రూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది.. తొర్రూరు పట్టణానికి చెందిన బసనబోయిన కుమారస్వామికి చెందిన పాడిగేదెలను రోజువారీగా మేతకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో వెలికట్ట గ్రామ శివారులోని వాగులో నీళ్లు తాగేందుకు గేదె వెళ్లగా, పక్కనే ఉన్న విద్యుత్ తీగకు ప్రమాదవశాత్తు తాకడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు.

ప్రాజెక్టును సందర్శించే ధైర్యం లేదా?

ఖానాపురం: పాకాలకు గోదావరి జలాలు మళ్లించే ప్రాజెక్టును సందర్శించే ధైర్యం లేదా? అని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో పాకాల కట్టపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో బీఆర్ఎస్ తరఫున నిలిచిన మాలోత్ కవితను గెలిపించాలని కోరుతూ మండలంలోని దబ్బీర్‌పేట, అశోక్‌నగర్, మంగళవారిపేట, బుధరావుపేట, ధర్మారావుపేట, ఖానాపురం, తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచారంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంను కూడా కలవలేని ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశాల్లో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌ను ఐదు రోజులు నడపాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఐదు రోజులపాటు నడపాలని, మార్కెట్‌లో మంచినీరు, సబ్సిడీ భోజనం, వేసవి కాలంలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి డీఎంఓ వెంకటరెడ్డి, మార్కెట్ కార్యదర్శి షంషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గునగంటి రాజన్న, నల్లపు సుధాకర్ మాట్లాడుతూ.. రబీ సీజన్ ప్రారంభమైన సందర్భంగా మార్కెట్‌కు వరి, అపరాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో వస్తున్నాయన్నారు. ఈ సమయంలో మార్కెట్ వారానికి మూడు రోజులే నడుపుతామని అధికారులు ప్రకటన చేయడం సబబుకాదన్నారు. మార్కెట్ ప్రతిరోజు నడిపి రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఈ సీజన్లో మూడు రోజుల మార్కెట్ నడపడం ద్వారా వ్యాపారులకు, చిల్లరకాంటాల నిర్వాహకులకు సహకరించినట్లు అవుతుందని పేర్కొన్నారు.

‘హరితహారం’ ఆహ్లాదం



రహదారి వెంట పెరిగిన హరితహారం చెట్లు

గార్ల: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం కింద మొక్కలు నాటింది. నాటి మొక్కలు నేడు చెట్లుగా పెరగడంతో బీటీ రహదారి అంతా నీడమయంగా మారింది. ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులు వేసవి కాలం కావడంతో కాసేపు రహదారిలో చెట్ల నీడకు సేద తీర్చుకొని వెళ్లిపోతున్నారు.

‘దేశంలో మోదీ శకం ముగిసింది’



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: దేశంలో మోదీ శకం ముగిసిందని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సీపీఐ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీకి 100 సీట్లు మించి రావన్నారు. 350 సీట్లకు మించి ఇండియా కూటమి విజయం సాధించి మంచి పరిపాలన అందిస్తుందన్నారు. మే 3వ తేదీన సీపీఐ 5వేల మందితో ఎన్నికల సభను నిర్వహిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సీపీఐ శ్రేణులు కష్టపడి పనిచేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, నర్రా శ్రావణ్, వీరవెల్లి రవి, వెలుగు పాల్గొన్నారు.

కార్పొరేట్లకే బీజేపీ ప్రాధాన్యం

బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబసునగర్ జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వాన్ని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, యాదగిరి, పార్వతమ్మ, సుధాకర్, వెంకన్న, అనంతాచారి, వెంకన్న, యశోద పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గూడూరు: వేసవి తీవ్రత పెరిగి భూగర్భ జలాలు అడుగంటి పోతున్న తరుణంలో ప్రస్తుతం గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు ఎంపీపీ సుజాత సూచించారు. సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బందిపై ఎక్కువ భారం పడుతుందన్నారు. గ్రామంలో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని పలువురు ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి. ఖాసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య ఉందని, పట్టించుకోవడంలేదని గుండెంగ ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్, గూడూరు ఎంపీటీసీ కత్తి స్వామి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారి

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న అధికారులు

కేసముద్రం: మండల కేంద్రంలోని గిర్నితండా, ఎన్టీఆర్‌నగర్, బ్రహ్మంగారితండా, కట్టుకాలువతండా, అమీనాపురం గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్, టాస్క్‌ఫోర్స్ మహబూబాబాద్, గూడూరు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 3600 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. 130 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 9 కేసులు నమోదు చేశారు. ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నాగేశ్వర్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ, ఎక్సైజ్ శాఖ సీఐ భిక్షపతి, ఎస్సై రాజేశ్వరి, రజిత, కిరీటి పాల్గొన్నారు.

4న బహిరంగ సభ

బయ్యారం: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ ఈనెల 4న బయ్యారంలో బహిరంగసభను నిర్వహించనున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. బలరాంనాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కష్టపడాలన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

విప్లవ కవులపై దాడులు సరికాదు

నెహ్రూసెంటర్: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో అభ్యుదయ, వామపక్ష, విప్లవ కవులపై జరిగిన దాడులను ఖండించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి సోమవారం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుస్తకావిష్కరణ సభలో కవులు, సామిత్యకారులపై ఏబీవీపీ, వీహెచ్‌పీ మతోన్మాదులు దాడులు చేయడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. దాడులకు పాల్పడిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

బయ్యారం: కేంద్రంలో అధికార బలం ఉందని బీజేపీ దాడులు చేయడం సరికాదని ఈ దాడులను రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకులు అరికట్టాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, నాగేశ్వరరావు, వీరభద్రం, రాకేష్, యుగంధర్, మహేష్ పాల్గొన్నారు.



బయ్యారం: నిరసన తెలుపుతున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

బావిలో పడి నెమలి మృతి

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జాతీయ పక్షి పడి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని తారాసింగ్ బావి తండాలో సోమవారం చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం తండా పరిధిలోని గుగులోతు కిషన్ వ్యవసాయ బావిలో జాతీయ పక్షి పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ నెమలి సుమారు 5రోజుల క్రితం బావిలో పడి చనిపోయి ఉంటుందని తండావాసులు చెబుతున్నారు.

హుండీ దొంగ అరెస్ట్

డోర్నకల్: కొద్ది రోజుల క్రితం ఆలయ హుండీలో నగదు చోరీ చేసిన దొంగను డోర్నకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న చిలుకోడు శివారు గంగమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి హుండీలోని రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలో భాగంగా గుర్తు తెలియని వ్యక్తిను అదుపులోకి తీపుకుని విచారణ జరపగా వేలిముద్రల ఆధారంలో చిలుకోడు ఆలయంగా చోరీ చేసిన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి గోపిగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపాడు.

మొక్కజొన్న, శ్రీగంధం చెట్లు దగ్ధం



బయ్యారం: మండలంలోని రెడ్యాతండాలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మొక్కజొన్న పంటతోపాటు శ్రీగంధం చెట్లు దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బానోత్ రాంకోటి తన మూడెకరాల్లో పండించిన మొక్కజొన్నను కుప్పగా పోశాడు. అగ్నిప్రమాదంలో మొక్కజొన్న కుప్పతోపాటు, శ్రీగంధం చెట్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లోని పోలింగ్ బూతులను సోమవారం ఎంపీడీఓ బాలరాజు సందర్శించి పరిశీలించారు. మండలంలోని రాజులకొత్తపల్లి, ఆలేరు, రాజ్యాతండా, బోటిమీది తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూతుల్లో సౌకర్యాలపై పరిశీలించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి కార్యదర్శులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ పార్థసారధి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు చేయించుకోవాలి

నెల్లికుదురు: కుష్ఠువ్యాధి గ్రస్తులు ఎలాంటి అనుమానాలు ఉన్న నిర్భయంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకుంటే తేలి పోతుందని డాక్టర్ వంశీకృష్ణ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం పురస్కరించుకుని వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సీహెచ్ వనాకర్ వైద్యసిబ్బంది విజయ్ కుమార్, శాంతమ్మ, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మహబూబాబాద్ రూరల్: వేసవి ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలనే ఉద్దేశ్యంతో శ్రీవాసవి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.

‘న్యాయం కోసం వెళ్తే దాడి చేశారు..’

కేసముద్రం: తన భర్త వదిలించుకోవాలని చూస్తున్నాడని, దీంతో న్యాయం చేయాలని ఇంటికి వెళ్తే అత్తింటి వారు కలసి దాడి చేశారంటూ ఓ దళిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలానికి చెందిన ఓ దళిత మహిళ, ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. వారి కాపురంలో కుమారుడు జన్మించాడు. ఈ క్రమంలో భర్త, అత్తమామలు ఇంటికి రానియకుండా ఆమెను అడ్డుకోవడంతో, ఆమె పెద్దమనుషులను ఆశ్రయించింది. ఈ మేరకు పోషణ నిమిత్తం డబ్బులు ఇస్తామని అత్తింటివారు ఒప్పుకోగా, తీరా ఒప్పుకున్న ప్రకారంగా డబ్బులు ఇవ్వకపోవడంతో, ఆ మహిళ సోమవారం తన భర్త ఇంటికి వెళ్లి న్యాయం చేయాలంటూ బైఠాయించింది. ఈ మేరకు కులం పేరుతో దూషిస్తూ, తనపై అత్తింటి వారు దాడి చేశారని ఆరోపిస్తూ, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.